క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అలంపూర్ రూరల్ : గ్రామాల్లోకి వచ్చే కొత్త వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ బాష అన్నారు. మండల పరిధిలోని లింగనేవాయి గ్రామంలో శనివారం పర్యటించి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయిజలో..

అయిజ: సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేసే సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయభాస్కర్ అన్నారు. శనివారం రాత్రి మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటీఎంల వద్ద మోసగాళ్లు కాచుకొని ఉంటున్నట్లు తెలిపారు. అపరిచితులు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోవిందుడికి ప్రత్యేక పూజలు



శాంతినగర్ : వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ సమూహంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వినయ్‌కౌశిల్ శర్మ పంచామృతాభిషేకం, అమ్మవారికి అర్చన గావించారు. అనంతరం గోవిందనామ జపం, హనుమాన్ చాలీసా పారాయణం గావించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

రాజోళి : మండల కేంద్రం రాజోళికి చెందిన చేనేత కార్మికుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. రాజోళికి చెందిన లోకేష్(40) మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం బాత్‌రూంలో జారి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక వైద్యుల దగ్గరకు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

అయిజ: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో 'ఐపీఎల్ సీజన్- 9' క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. మొదటి బహుమతిగా రూ. 50,016, ద్వితీయ బహుమతి రూ. 30,016, తృతీయ బహుమతి రూ.10,016 ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్గనైజర్లు వేణు, నవదీప్, మల్లికార్జున్‌లు పోటీలను పర్యవేక్షించారు.

అంజన్న సన్నిధిలో సీఐ పూజలు



ధరూరు : మండల పరిధిలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో గద్వాల సీఐ టంగుటూరి శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో సీఐ పాల్గొన్నట్లు ఆలయ ధర్మకర్త గిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన దివ్యాంగుడు వి.పెద్దనాగన్నకు శనివారం అలంపూర్ చౌరస్తాలోని కార్యాలయలంలో జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ మహ్మద్ సిరాజ్ ఎలక్ట్రికల్ సైకిల్ కోసం ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో గణేష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విక్రయ కష్టాలు

- కొనుగోలు కేంద్రాల వద్ద కొరవడిన సౌకర్యాలు
- పేరుకుపోతున్న ధాన్యం రాశులు
- వర్షం , మంచు ప్రభావంతో రైతుల ఆందోళన



మాన్‌దొడ్డిలో కురిసిన చినుకుల కారణంగా ధాన్యానికి పట్టాలు కప్పిన రైతులు (ఫైల్)

రాజోళి: ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు ఎన్నో పడరాని పాట్లు పడుతున్నారు. అకాల వర్షాలు, అనావృష్టి, ప్రతికూల వాతావరణాలతో రైతులు ఎన్నో కష్టాలు పడి వరి పండిస్తే, ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాల్లో చోటు చేసుకున్న అలసత్వం కారణంగా ఆందోళన చెందుతున్నట్లు రైతులు వాపోతున్నారు. రాజోళి మండల కేంద్రంతో పాటు తుంగభద్రా నది పరివాహక గ్రామాల్లో నది నీటిపై ఆధారపడి నాట్లు వేసుకుని సేద్యం చేస్తుంటారు. పంట పండించడానికి పడిన బాధలు ఒకెత్తు అయితే, చేతికొచ్చిన పంట అమ్ముకునేందుకు పడుతున్న బాధ మరొక ఎత్తని వాపోతున్నారు.

కేంద్రాల్లో సౌకర్యాల కొరత..

మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎక్కువ మొత్తంలో వరి పండించిన గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యమైవుతుందంటున్నారు. ప్రధానంగా మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా..వచ్చర్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులైన కరెంట్ సప్లై, తాగునీటి వసతి లేకపోవడంతో రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ధాన్యం రాసుల వద్ద కాపలా ఉండటం కూడా కష్టంగా మారిందని రైతులు అంటున్నారు. చీకటి సమయంలో కేంద్రాల దగ్గర లైటింగ్ లేకపోవడంతో, చీకట్లో విష పురుగులు సంచరిస్తున్నట్లు తెలిపారు.

మంచుతో ఇబ్బందులు..

ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ధాన్యం తేమ శాతంలో తేడా వస్తుందని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం 17 శాతం తేమ ఉండాలని చెప్పినప్పటికీ, వాతావరణ మార్పుల కారణంగా తేమ శాతంలో తేడాలు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. గత శుక్రవారం స్వల్పంగా చినుకులు కురవడంతో మాన్‌దొడ్డి కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆందోళన చెందారు. ఇలాంటి పరిస్థితుల మధ్య తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని, వేగవంతంగా వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కోరుతున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోసిన రైతులు

బ్యాగులు లేవంటున్నారు..

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు చాలా ఉన్నాయి. కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత ఎక్కువగా ఉంది. దీంతో అధికారులు బ్యాగులు లేవని ధాన్యం కొనుగోలులో ఆలస్యం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి కొరత తీర్చాలి.

-సత్యారెడ్డి, రైతు, పెద్దధన్వాడ

కరెంట్ సరఫరా చేయాలి..

కరెంట్ లేక పోవడంతో ధాన్యం రాసుల వద్ద నిద్రించే రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి సమయాల్లో విష సర్పాలు సంచరిస్తున్నాయి. సౌకర్యాల కొరత వేధిస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి వేగంగా కొనుగోళ్లు చేపట్టాలి.

- రఘునందన్ రెడ్డి, రైతు పెద్దధన్వాడ

సమస్యలు పరిష్కరిస్తాం..

పలు కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉన్నట్లు పర్యవేక్షణలో గ్రహించాం. గన్నీ బ్యాగుల కొరత కూడా ఉంది. కేంద్రాల్లో సమస్యలు ఉన్నతాధికారులకు తెలియజేశాం. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తాం.

-రవి, సీఈఓ
వడ్డేపల్లి,పీఏసీఎస్

రైతులకు సహకారం అందిస్తాం



రుణమాఫీ జాబితా ప్రదర్శిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

మానవపాడు: రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సహకారం అందిస్తామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సహకార సంఘంలో దీర్ఘకాలిక రుణాల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్షక మిత్ర రుణాలుకు సంబంధించి మండలంలో 11మంది రైతులకు రూ. 1,10 కోటి లక్షల రుణాల చెక్కులు పంపిణీ చేశామన్నారు. 6 సంవత్సరాలు సంవత్సరానికి రెండు కంతులు ఆరు నెలలకోసారి రైతులు రుణాలు తిరిగి చెల్లించాలని తెలిపారు. ఇట్టి రుణాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణం కావాల్సిన రైతులు సహకార సంఘంలో పాసుబుక్ సంబంధించిన రికార్డులు సమర్పిస్తే 41రోజుల్లో రుణాలు రైతులకు అందుతాయని తెలిపారు.

రుణమాఫీ జాబితా విడుదల

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 4వ విడుత రుణ మాఫీ జాబితా అందుబాటులో ఉన్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న 132 మంది రైతుల రుణాలు రూ.2లక్షలు మాఫీ జాబితా వచ్చినట్లు తెలిపారు. మాఫీ అయిన వారు ఆర్‌ఓఆర్, ధరణి ఈసీ, పహణీ ఎస్బీ అకౌంట్ జిరాక్స్ సహకార సంఘ ఉద్యోగులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగులు అందజేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పల్లయ్య

అయిజ: ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. ప్రభుత్వం గన్నీ బ్యాగులు అందజేయాలన్నారు. శనివారం మండలంలోని చిన్ని తాండ్రపాడులో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని పల్లయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గన్నీ బ్యాగులు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో వరి కొనుగోళ్లు మందకొడిగా సాగుతుందన్నారు. దీంతో రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోతున్నారని వాపోయారు. ప్రభుత్వం ఏర్పాటు చేయకుంటే నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మత్తాలి, మల్లికార్జున్, వెంకటన్న, సుధాకర్, సురేష్, రాజు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి



ప్లేట్లు పంపిణీ చేస్తున్న చిరంజీవి అభిమానులు

రాజోళి : ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య అన్నారు. మండలంలోని మాన్‌దొడ్డి గ్రామ పాఠశాల విద్యార్థులకు చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్లేట్లు పంపిణీ చేశారు. పాఠశాలలో 160 మంది విద్యార్థులు ఉండగా మధ్యాహ్న భోజన సమయంలో సరైన ప్లేట్లు, గ్లాసులు లేవని తెలియడంతో అసోసియేషన్ ద్వారా ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు చిరంజీవి అభిమానుల సంఘాన్ని కొనియాడారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్, ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమి రెడ్డి, ఫ్యాన్స్ ఉపాధ్యక్షుడు హుస్సేన్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగ మహోత్సవం



పుష్పాభిషేకంలో చైర్మన్ కేశవ్ దంపతులు

గద్వాలటౌన్ : సుప్రభాత సేవ మొదలు పవళింపు సేవ వరకు ఆనందనిలయుడు ఏదో ఒక సేవలో తరిస్తుంటాడు. గోవింద మాల ధరించిన మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం గద్వాల టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి పుష్పయాగం కమనీయంగా జరిగింది. వివిధ రకాల పుష్పలతో వైభవంగా అభిషేకం చేశారు. పుష్పయాగం తిలకించడానికి గోవింద, అయ్యప్ప మాలధారులతో పాటు పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోవిందనామ స్మరణంతో టీటీడీ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, హైదరాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దళిత సమాజాన్ని అవమానిస్తున్నారు

గద్వాల న్యూటౌన్: బీజేపీ తన రాజకీయ అవసరాల కోసం డా. బీఆర్ అంబేద్కర్‌ను వాడుకొని, పార్లమెంట్ సాక్షిగా వ్యంగ్యంగా మాట్లాడటం దళిత సమాజాన్ని అవమానించినట్లేనని మాల మహనాడు నాయకులు తిమ్మప్ప, హనుమంతు, హరీష్, నరేష్ తదితరులు ఒక ప్రకటనలో నిరసన వ్యక్తం చేవారు. కేంద్రమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ కార్యాలయాలు ముట్టడిస్తామన్నారు. ప్రజా క్షేత్రంలో వారి వ్యాఖ్యలను ఎండగడతామని పేర్కొన్నారు. క్షమాపణ చెప్పేంత వరకు పోరాటం ఆగదని ప్రకటనలో హెచ్చరించారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇటిక్యాల : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇటిక్యాల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ శ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పని సరిగా 4వ తరగతి చదువుతున్న వారై ఉండాలన్నారు. ఫిబ్రవరి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు టీజీసీఈటీ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రవల్లి : అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కొండేరు స్టేజీలోని ఓ షెట్టర్‌లో రేషన్ బియ్యం నిల్వ చేసిన సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో 13 బ్యాగుల (6.5క్వింటాళ్ల) రేషన్ బియ్యం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. షాపు యజమాని మంద కల్యాణ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆంగ్ల ఫెస్ట్



ఎర్రవల్లి : మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో శనివారం కరస్పాండెంట్ మధులికరెడ్డి ఆధ్వర్యంలో ఆంగ్ల ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్ల పాఠ్యాంశాలను వివిధ మోడల్స్, ఛార్ట్స్ రూపంలో ఏర్పాటు చేసి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాపురం విద్యార్థుల ప్రతిభ

శాంతినగర్ : జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో రామాపురం విద్యార్థులు ప్రతిభ చాటారు. గద్వాల బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో రామాపురం విద్యార్థులు చేసిన ప్రయోగాన్ని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అభినందించినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

మున్సిపల్ సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్ : మున్సిపాలిటీలోని సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ సీడీఎంఏను కోరారు. హైదరబాదులోని సీడీఎంఏ కార్యాలయంలో కమిషనర్, పురపాలక శాఖ సంచాలకులు టీకే. శ్రీదేవిని శనివారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీడీఎంఏకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపల్ దినసరి వేతన కార్మికులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరినట్లు తెలిపారు. గత నాలుగేళ్లుగా ఇదే విషయం గురించి పలుమార్లు వినతులు ఇచ్చినట్లు సీడీఎంఏకు వివరించినట్లు తెలిపారు. పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి పరామర్శ..

హైదరబాద్ నిమ్స్ ఆస్పత్రిలో నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో అలంపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ ఆయన్ను పరామర్శించారు. జగన్నాథం కుమారుడు శ్రీనాథ్‌తో మాట్లాడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అధికారులను కలిసిన మార్కెట్ చైర్మన్



అడిషనల్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అలంపూర్ : కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్‌ను అలంపూర్ చౌరస్తా మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న, వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, రాష్ట్ర టెలికాం సలహా కమిటీ సభ్యుడు మహ్మద్ ఇస్మాయిల్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేశారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందనలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి నారాయణను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ కమిటీ ధర్మకర్తలు జగదీష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై చర్య తీసుకోవాలి

గద్వాలన్యూటౌన్: వీక్షణం ఎడిటర్, ప్రముఖ రచయిత ఎన్ వేణుగోపాల్ దురుసగా ప్రవర్తించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. డిసెంబర్ 19 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో జరిగిన జాతీయ బుక్‌ఫేర్‌లో వీక్షణం స్టాల్‌లో చోటు చేసుకున్న మత ఉన్మాద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. స్టాల్‌లో ప్రదర్శించినకో చారిత్రక పరిశోధనకు సంబంధించిన పుస్తకాన్ని వివాదం చేస్తూ నిర్హేతుక వాదనలతో రచయిత వేణుగోపాల్‌పై దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. దుండగులను శిక్షించి కవులు, కళాకారులు, రచయితలు, మేధావులకు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో అధ్యయన వేదిక కోకన్వీనర్ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ మండల కమిటీ ఏర్పాటు



నూతన కమిటీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రవల్లి : మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం ఎస్‌జీటీయూ ఆధ్వర్యంలో ఎస్‌జీటీ యూనియస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మండల ఎస్‌జీటీ నూతన కమిటీని ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ మండల గౌరవ అధ్యక్షుడిగా ఇమాముద్దీన్, మండల అధ్యక్షునిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనరసింహ, ప్రదాన కార్యదర్శిగా ఆర్.రాముడు, కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా రాఘవేంద్ర, మహిళా కార్యదర్శిగా జయ్యమ్మను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు సోము సుందర్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కాంతయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న సోషల్ ఫోరం నాయకులు

గద్వాలటౌన్ : పోటీ ప్రపంచంలో విద్యార్థులను ప్రోత్సహించినప్పుడే మరింత ముందుకు వెళ్తారని నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల ఆవరణలో సోషల్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 70 పాఠశాలలకు చెందని 200 మంది విద్యార్థులు టెస్టులో పాల్గొన్నారు.

విజేతలు..

తెలుగు మీడియం విభాగంలో పరుష, హరిత, రాములమ్మలు వరస మూడు స్థానాల్లో నిలిచారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో ఛార్లెస్ చంద్ర, శివసాయి, వినోద్, గురుకుల విభాగంలో నజీయ, సుమతీ ప్రతిభ చాటారు. టీపీఆర్‌టీయూ జిల్లా మహిళా కన్వీనర్ జమున మొదటి బహుమతి పొందిన విద్యార్థులకు రూ.5వేల నగదు, రెండో బహుమతి సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు హుస్సేన్, సుమతిలు రూ.2 వేల నగదుతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి చదువులో అత్యంత ప్రతిభ అవసరమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీయడానికి పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సోషల్ ఫోరం నాయకులు కృష్ణగౌడ్, నారాయణ, రామన్న, వెంకటశెట్టి, దావీదు, విజయబాస్కర్ రెడ్డి, రేణుకాదేవి, శ్రీలక్ష్మి, కృష్ణకుమారి, రాజుసాగర్, లక్ష్మారెడ్డి, రామచంద్రయ్య, రాజు, ఈదన్న, పరుశురాం, ప్రహ్లాద్, శ్రీరామ్ తదతరులు పాల్గొన్నారు.

ఆదిశిలాక్షేత్రంలో ప్రముఖుల పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ



సినీ నటి శాంతితో ఆలయ అధికారులు

మల్దకల్ : ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రముఖుల పూజలు..

లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జెడ్పీ సీఈఓ కాంతమ్మ ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా సినీ హీరో కీర్తిశేషులు శ్రీహరి సతీమణి నటి శాంతి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, అర్చకులు వారికి సాదర స్వాగతం పలికారు. శేషవస్త్రంతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు మధుసూధనాచారి, రమేషాచారి, రవిచారి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎర్రవల్లి : మండల పరిధిలోని కొండపేట గ్రామానికి చెందిన యువరైతు గంగాధర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జోగుల రవి శనివారం కొండపేటకు చేరుకొని గంగాధర్ భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నర్సింహులు, అంజి, వెంకటన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.